సాక్షి కామారెడ్డి

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025

I



హడలెత్తిస్తున్న చోరులు

బాన్సువాడ ప్రాంతంలో దొంగలు హడలెత్తిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు.

- IIలో ▸



జోరుగా నల్లమట్టి దందా

జుక్కల్ ప్రాంతంలో రైతుల ముసుగులో చెరువుల్లోంచి నల్లమట్టిని తవ్వి, పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

- IIIలో ▸

గరిష్టం/కనిష్టం
43.0 /24.2

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

అప్పు పుడుతలేదు!

- అవసరానికి సర్దుబాటు కాని పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న పేద, మధ్యతరగతి వర్గాలు
- ఎవరిని కదిలించినా డబ్బు సమస్యనే..
- పల్లె పట్నం అంతటా ఇదే తీరు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : గతంలో డబ్బులు అవసరం ఉందంటే ఎవరో ఒకరు సర్దుబాటు చేసేవారు. స్నేహితులు, బంధువులు చేబదలు ఇచ్చేవారు. లేదంటే అప్పైనా పుట్టేది. వాటితో అవసరాలు వెళ్లదీసుకుని, డబ్బులు సర్దుబాటు అయ్యాక తిరిగి చెల్లించేవారు. వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ నిర్వాహకులు కూడా నమ్మకం ఉన్న వారికి అప్పులిచ్చేవారు. ఇప్పుడు పరిస్థితులు తలకిందులయ్యాయి. అవసరానికి డబ్బులు సర్దుబాటు కావడం లేదని, కనీసం అప్పు కూడా పుట్టడం లేదని చాలామంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఆపదలో కూడా డబ్బులు సర్దుబాటు కాక పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. వ్యవసాయంలో పెట్టుబడులు పెరగడం, దిగుబడులు తగ్గడంతో కష్టానికి ఫలితం దక్కడం లేదు. ఏడాదికేడాది అప్పులు పెరగడమే తప్ప మిగులుబాటు లేకుండాపోయింది. కుల వృత్తులు, స్వయం ఉపాధి చేసుకునేవారు కూడా అద్దెలు, విద్యుత్ బిల్లులు, నిర్వహణ వ్యయం పెరిగిపోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవారు కూడా మడిగెల అద్దెలు భారంగా మారడం, వ్యాపారంలో పోటీ పెరగడంతో వారి ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతింది. రోజువారీ పనులు చేసుకునేవారి సంపాదన బట్టకు, పొట్టకు అన్నట్టుగా తయారైంది. పిల్లల ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, ప్లాటు కొనుగోలు, ఇంటి నిర్మాణం.. ఇలా దేనికైనా అప్పులు చేయాల్సినని పరిస్థితి. అయితే ఏ అవసరం ఉన్నా ఎవరో ఒకరు డబ్బులు సర్దుబాటు చేస్తారన్న నమ్మకం లేకుండాపోయింది. దీంతో చాలా మంది మనోవేదనకు గురవుతున్నారు.

కలిసిరాని కాంట్రాక్టు పనులు..

ప్రభుత్వ అభివృద్ధి పనుల కాంట్రాక్టులు చేసి నాలుగు డబ్బులు వెనకేసుకోవాలని కొందరు కింది స్థాయి నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అప్పులు చేసి పనులు పూర్తి చేశారు. ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సర్పంచ్‌లు చాలా మంది రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా పనుల మీద పెట్టుబడులు పెట్టారు. వారంతా రెండుమూడేళ్లుగా బిల్లులు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఓ మారుమూల గ్రామ సర్పంచ్ చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో భూమిని అమ్ముకుని అప్పులు కట్టాడు. లాభాల మాట అటుంచితే అప్పుల కింద ఉన్న భూమి పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చిన్నచిన్న కాంట్రాక్టర్లతో పాటు బడా కాంట్రాక్టర్లు కూడా బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారు.



ఫైనాన్స్ దందా ఆగం..

అప్పులు తీసుకున్న వారు చాలా మంది డబ్బులు సర్దుబాటు కాక చేతులెత్తేయడంతో కొందరు ఫైనాన్స్ వ్యాపారులు దెబ్బతిన్నారు. దీనికి తోడు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారంటూ పోలీసులు ఫైనాన్స్ నిర్వాహకులు, వడ్డీ వ్యాపారుల ఇళ్లపై దాడులు నిర్వహిస్తున్నారు. దీంతో చాలా మంది వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారులు దందాను వదిలేశారు. కొందరు ఫైనాన్స్, వడ్డీ వ్యాపారులు కూడా డబ్బులు రికవరీ కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నట్టు తెలుస్తోంది. వరుస దెబ్బలతో ఫైనాన్స్ రంగం కుదేలైంది. వెరసి సామాన్యుడికి అప్పు పుట్టని పరిస్థితి ఏర్పడింది.

'రియల్' కుదేలై..

చాలామంది భూముల మీద పెట్టుబడులు పెట్టారు. భూముల క్రయవిక్రయాలతో సులువుగా డబ్బులు సంపాదించవచ్చనే భావనతో డబ్బున్నవారితో పాటు మధ్య తరగతి ప్రజలు కూడా అప్పులు చేసి మరీ భూములు కొన్నారు. అయితే కొంతకాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలై భూములు, ప్లాట్ల క్రయవిక్రయాలు సాగడం లేదు. సంవత్సరాల తరబడిగా వ్యాపారంలో వృద్ధి లేకపోగా, ధరలు పడిపోవడం అయినా సరే అమ్ముదామంటే కొనేవారు లేకపోవడంతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన వారంతా ఇంకా మునిగిపోతున్నారు. జిల్లా కేంద్రంలో ఇళ్లు నిర్మించి అమ్మేవారు ప్లాట్లతో పాటు ఇళ్ల నిర్మాణానికి డబ్బులు వెచ్చించారు. ఇప్పుడు ఇళ్లు అమ్ముడుపోక అవన్నీ ఇరుక్కుపోయాయి. దీంతో అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన వారంతా దివాలా అంచున ఉన్నారు. ప్లాటు ధర, ఇంటి నిర్మాణానికి అయిన వ్యయం ఇచ్చినా సరే అమ్ముదామంటే కొనేవాళ్లు లేరని బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వడ్డీలకు వడ్డీలు పెరిగి అవస్థలు పడుతున్నామంటున్నారు.

బంగారమే ఆధారం..

బయట అప్పు పుట్టని పరిస్థితుల్లో బంగారమే ఆధారమవుతోంది. చాలామంది బ్యాంకుల్లో బంగారం, ఆభరణాలు తాకట్టుపెట్టి అప్పు తీసుకుంటున్నారు. బంగారం అమ్మితే తిరిగి కొనలేమని కుదువపెడుతున్నారు. ప్రతి బ్యాంకులో నిత్యం ఐదు నుంచి పది మంది గోల్డ్ లోన్ తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. మారుమూల గ్రామాల నుంచి పట్టణాలు, నగరాల దాకా బ్యాంకుల్లో గోల్డ్ లోన్లు విపరీతంగా తీసుకుంటున్నారు. ఏ అవసరం ఉన్నా సరే ఉన్న బంగారాన్ని బ్యాంకుల్లో పెట్టి అప్పు పొందుతున్నారు.

న్యూస్‌రీల్

ఎలక్ట్రీషియన్‌కు నోటీస్

సాక్షి ఎఫెక్ట్..

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు శ్రీసిద్దరామేశ్వరాలయం హుండీ లెక్కింపులో చేతివాటం ప్రదర్శించిన ఎలక్ట్రీషియన్ బి.లక్ష్మీనారాయణకు సంజాయిషీ నోటీస్ జారీ చేసినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు. 'హుండీ లెక్కింపులో ఉద్యోగి చేతివాటం' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన వార్తపై గ్రామస్తులు స్పందించారు. సింగిల్ విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, నేతలు మైపాల్‌రెడ్డి, దుంపల మోహన్‌రెడ్డి, నీల అంజయ్య, నర్మల రాంచంద్రం, ద్యాగల కిరణ్, సుధాకర్, జనార్దన్ రెడ్డి ఆలయానికి వెళ్లి ఈవో శ్రీధర్‌తో మాట్లాడారు. సీసీ ఫుటేజీలను చూపించాలని పట్టుబట్టారు. చేతివాటం ప్రదర్శించిన ఉద్యోగిపై ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. దీంతో ఈవో శ్రీధర్ మాట్లాడుతూ సీసీ ఫుటేజీల కోసం టెక్నీషియన్‌ను పిలిపిస్తానన్నారు. ఎలక్ట్రీషియన్ లక్ష్మీనారాయణ వ్యవహారంపై ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తనకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు లక్ష్మీనారాయణకు సంజాయిషీ నోటీస్ జారీ చేశామన్నారు.

నేడు బాల్య వివాహాల నిరోధంపై అవగాహన కార్యక్రమం

కామారెడ్డి టౌన్: బాల్య వివాహాల నిరోధంపై బుధవారం జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జస్ట్ ఫర్ రైట్ సాధన సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గిరిజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాలు, ప్రార్థన స్థలాల వద్ద ప్రజలు, పురోహితులు, వివిధ మతాలకు చెందినవారికి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

రేపటినుంచి అథ్లెటిక్స్ వేసవి శిబిరం

కామారెడ్డి టౌన్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు గురువారంనుంచి అథ్లెటిక్స్ వేసవి శిబిరం నిర్వహించనున్నట్లు కోచ్ శివ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట మండలంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. మే 30వ తేదీ వరకు కొనసాగే శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నీటికోసం నిధుల కేటాయింపు



నాగిరెడ్డిపేట : రోజురోజుకు ఎండలు ముదురుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేక నిధులను కేటాయించింది. జిల్లాకు రూ. కోటి మంజూరయ్యాయి. జిల్లాలోని మొత్తం 536 గ్రామపంచాయతీల ఖాతాలలో నాలుగురోజుల క్రితం ఆ నిధులను జమ చేశారు. పంచాయతీ స్థాయినిబట్టి ఒక్కోదాని ఖాతాలో రూ.10 వేల నుంచి రూ.29 వేల వరకు జమయ్యాయి. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. కాగా వీటిని పైపులైన్ లీకేజీలు, బోర్‌మోటార్ మరమ్మతులు వంటి అత్యవసర పనులకు వినియోగించాలని అధికారులు ఆదేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు సరిపోవు. కానీ ఉన్న నిధులను సర్దుబాటు చేసుకునేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. రోజురోజుకు భూగర్భజలాలు పడిపోతుండడంతో గ్రామాల్లో బోరుబావుల్లో నీటిమట్టం తగ్గుతోంది. ఈ క్రమంలో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. ప్రస్తుతం విడుదలైన నిధులు కొంత ఊరట ఇవ్వనున్నాయి. గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది.

సొసైటీకి తాళం

మాక్లూర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గొట్టుముక్కల గ్రామానికి చెందిన రైతులు మాక్లూర్ సొసైటీకి తాళం వేశారు. మంగళవారం ఉదయం సొసైటీకి చేరుకున్న రైతులు సిబ్బందిని బయటకి పంపి తాళం వేసి ధర్నా చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శేఖర్ సొసైటీ చైర్మన్ బూరోళ్ల అశోక్‌ను వెంటబెట్టుకుని సొసైటీ వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

కాలభైరవం భజే..



పండ్లతో అలంకృతులైన స్వామివారు

దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్య క్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం వైశాఖమాస పూజలు ప్రారంభమయ్యాయి. కాలభైరవుడికి వైశాఖ మాసంలో ప్రతి మంగళవారం విశేష పూజలు నిర్వహిస్తారు. మొదటి మంగళవారం కావడంతో 108 రకాల పండ్లతో స్వామివారిని అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రెండో మంగళవారం 108 రకాల స్వీట్లతో, మూడో మంగళవారం 108 రకాల కూరగాయలతో, నాలుగో మంగళవారం 108 రకాల పూలతో స్వామివారిని అలంకరిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాచర్ల శ్రీనివాస శర్మ, వంశీకృష్ణశర్మ, ఈవో ప్రభు గుప్తా, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. - రామారెడ్డి



కాలభైరవ స్వామి పూజలో పాల్గొన్న భక్తులు

రహదారి విస్తరణతో తొలగుతున్న మలుపులు

- తగ్గనున్న దూరభారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



పోచారం వద్ద బ్రిడ్జి నిర్మాణం

ఎల్లారెడ్డి: హైదరాబాద్ -మెదక్ -బోధన్(హెచ్ఎంబీ) జాతీయ రహదారి(765 డి) విస్తరణలో భాగంగా నేషనల్ హైవే అథారిటీ అధికారులు మలుపులను తొలగిస్తున్నారు. దీంతో వాహనదారులకు దూరభారం తగ్గనుంది. 765 డి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా దిండిగల్ నుంచి రుద్రూర్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇప్పటికే దిండిగల్ నుంచి మెదక్ వరకు 10 మీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. టూ లైన్ విత్ పేవ్డ్ షోల్డర్స్ పద్ధతిన మెదక్ నుంచి రుద్రూర్ వరకు కొత్త డిజైన్ ప్రకారం జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. దిండిగల్ నుంచి నర్సాపూర్ అటవీ ప్రాంతం గుండా మెదక్ వరకు నిర్మించిన రోడ్డులో భారీ మలుపులను తొలగించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం మెదక్ నుంచి రుద్రూర్ వరకు జరుగుతున్న రోడ్డు పనులలో భాగంగా మెదక్ శివారులోని ఔరంగాబాద్, హవేళీ ఘణపురం, పోచారం అభయారణ్యం, ప్రాజెక్ట్ పైబ్రిడ్జి నిర్మాణంతో బైపాస్ రోడ్డు, తాండూర్ గేట్, జానకంపల్లి, మెల్లకుంట తండా, కన్నారెడ్డి, మాచాపూర్ గ్రామాల వద్ద ఎల్లారెడ్డి వరకు భారీ మలుపులను తొలగించారు. ఎల్లారెడ్డి నుంచి రుద్రూర్ వరకు లింగారెడ్డిపేట్, తిమ్మారెడ్డి, అన్నాసాగర్, కామ్‌శెట్టిపల్లి, నస్రుల్లాబాద్ ప్రాంతాలలో భారీ మలుపులను తొలగించి నేరుగా రోడ్డు వేస్తున్నారు. దిండిగల్ నుంచి రుద్రూర్ వరకు మలుపులను తొలగించడం వల్ల సుమారు 35 కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. దీని ప్రకారం ఎల్లారెడ్డి నుంచి సికింద్రాబాద్ బస్టాండ్ వరకు గతంలో 138 కిలోమీటర్ల దూరం ఉండగా కొత్త రోడ్డు నిర్మాణంతో 125 కిలోమీటర్లకు తగ్గనున్నట్లు తెలుస్తోంది. జాతీయ రహదారుల నిర్మాణంలో భారీ మలుపులను తొలగించడం వల్ల దూరభారం తగ్గనుండడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పోచమ్మరాల్ వద్ద ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డు

లారీలు రావు.. ధాన్యం బస్తాలు పోవు

- కోమలంచ కొనుగోలు కేంద్రంలో రైతులకు తిప్పలు

నిజాంసాగర్ : నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు నెమ్మదిగా సాగుతున్నాయి. ధాన్యం బస్తాల తరలింపునకు లారీలు కొరత తీవ్రంగా ఉంది. దీంతో ధాన్యం తూకాలు వేసినా లారీలు సక్రమంగా రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో బస్తాల నిల్వలు పేరుకుపోతున్నాయి. మహమ్మద్‌నగర్ మండలంలోని కోమలంచ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం తూకాలు చేపడుతున్నారు. రైతుల నుంచి ధాన్యం కాంటా వేయడంతో పాటు ధాన్యం బస్తాల తరలింపునకు తంటాలు పడుతున్నారు. ఈ కొనుగోలు కేంద్రానికి లారీలు సక్రమంగా రాకపోవడంతో కొనుగోలు కేంద్రం వద్ద సుమారు 3 వేల వరకు ధాన్యం బస్తాలు పేరుకుపోయాయి. రోజుకు ఒక్క లారీ చొప్పున వస్తుండడంతో ధాన్యం బస్తాల నిల్వలు రోజురోజుకు పేరుకుపోతున్నాయని రైతులంటున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రం వద్ద తూకాలు చేసే యంత్రాలు చెడిపోతుండడంతో నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



కోమలంచ కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉన్న వరిధాన్యం బస్తాలు

మూడు వేల బస్తాలు కేంద్రంలోనే ఉన్నాయి



ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కేంద్రం నిర్వహిస్తున్నాం. బిహారీ కూలీలు హమాలీ చేస్తుండటంతో తూకాలు చేపడుతున్నాం. రోజుకు ఒక్కలారీ మాత్రం వస్తుండటంతో ధాన్యం బస్తాల నిల్వలు పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం మూడు వేల బస్తాల ధాన్యం కేంద్రంలోనే ఉన్నాయి. రోజు ఒక్క లారీ మాత్రం వస్తుండటంతో ధాన్యం బస్తాలు రైస్ మిల్లులకు వెళ్లడం లేదు. రోజుకు రెండు, మూడు లారీలు పంపిస్తే కొరత ఉండదు.

– విజయ, గ్రామ సంఘం అధ్యక్షురాలు

'భూభారతి'తో సామాన్యుడికి మేలు

- 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి ఈ చట్టాన్ని తెచ్చాం
- ఇది దేశానికి రోల్ మోడల్ కాబోతోంది
- త్వరలో వీఆర్వోలు, వీఆర్‌ఏలను నియమిస్తాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నాగిరెడ్డిపేట/లింగంపేట : భూభారతి చట్టం ద్వారా సామాన్యుడికి మేలు జరగుతుందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన శెట్పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ ఏది చెబితే అదే చట్టంగా ఉండేదన్నారు. దొరగారు ధరణి పథకాన్ని భూస్వాముల కోసం తెచ్చి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. భూభారతి చట్టం అలా కాకుండా పకడ్బందీగా పేదోడికి న్యాయం జరిగేలా రూపొందించామన్నారు. 18 రాష్ట్రాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, 9 నెలలు మేధోమథనం చేసి మేధావుల సూచనలు, సలహాలు తీసుకొని ఈ చట్టాన్ని తెచ్చామన్నారు. ఇది దేశానికి రోల్ మోడల్ కాబోతుందన్నారు. తరతరాలుగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు భూభారతి పోర్టల్ ద్వారా తీరనున్నాయని పేర్కొన్నారు.

అంచెలంచెలుగా సమస్యల పరిష్కారం

భూభారతి చట్టం ద్వారా తహసీల్దార్, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్.. ఇలా వివిధ స్థాయిలలో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఆయా స్థాయిలలో పరిష్కారం కాకపోతే స్పెషల్ ట్రిబ్యునల్ ప్రవేశపెట్టడానికి చట్టంలో వెసులుబాటు కల్పించామన్నారు. రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా తప్పులు చేస్తే ఈ చట్టం ద్వారా సదరు అధికారిపై చర్యలు తీసుకోవడానికి వీలుంటుందన్నారు. లింగంపేట మండలంలో ప్రైవేటు, ప్రభుత్వ, అసైన్‌మెంటు భూముల సమస్యలు ఉన్నందున కలెక్టర్ విచారణ చేసి పరిష్కరించాలని ఆదేశించారు.



హెలీప్యాడ్ వద్ద మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎమ్మెల్యే విన్నపం మేరకు..

ముందుగా రాష్ట్రంలో 4 జిల్లాల్లో 4 మండలాలను ఎంపిక చేసి, చట్టాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు విన్నపం మేరకు లింగంపేట మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేశామన్నారు. ఇప్పటివరకు మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలకుగాను 20 చోట్ల సదస్సులు పూర్తయ్యాయని, వివిధ భూసమస్యలపై 3,400 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

హామీలు అమలు చేసి తీరుతాం..

ఇందిరమ్మ రాజ్యంలో పేదల కోసం ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఇతర హామీలన్నింటిని అమలు చేసి తీరుతామని పొంగులేటి స్పష్టం చేశారు. ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు పక్షం రోజుల్లో వీఆర్వోలు, వీఆర్‌ఏలను నియమించనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ప్రాణహిత ప్యాకేజీ పనులకు నిధులు మంజూరయ్యేలా చూస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్న విషయాన్ని సీఎం, రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకువెళ్లానని, వారు స్పందించి భూభారతి చట్టం అమలుకు లింగంపేట మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేశారని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. రైతులకు భూ సమస్యలు లేకుండా చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, భూభారతి ప్రత్యేకాధికారి రాజేందర్, ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రైతులు



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వేదికపై ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, అధికారులు, నాయకులు

మంత్రి దృష్టికి 'పోచారం' భూముల సమస్య

నాగిరెడ్డిపేట: పోచారం గ్రామశివారులోని భూముల సమస్యను గ్రామానికి చెందిన మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. శెట్పల్లి సదస్సు భూసమస్యపై రైతులెవరైనా మాట్లాడాలని మంత్రి సూచించగా.. పోచారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. తమ గ్రామశివారులోని రైతుల భూములకు పట్టాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోచారం ప్రాజెక్టు అంచునగల సర్వే నం. 268లో రైతులకు 1975 లోనే అప్పటి ప్రభుత్వం విడతలవారీగా సుమారు 150 ఎకరాలకు పట్టాపాసుపుస్తకాలు ఇచ్చిందన్నారు. కానీ ధరణి వల్ల కొత్త పాస్‌బుక్కులు రాలేదన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తే సర్వే నం. 268లో 54 ఎకరాల భూమి మాత్రమే ఉందని, కానీ 150 ఎకరాలకు పట్టాలు ఇచ్చారని చెప్పారని పేర్కొన్నారు. తమ గ్రామ రైతులకు పట్టాలు ఇప్పించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ రెవెన్యూ అధికారులను వివరణ కోరారు. మరోసారి భూములను సర్వే చేయించి సమస్యను పరిష్కరిస్తామని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

లయన్స్ ఆస్పత్రికి ప్రభుత్వ భవనం



బోధన్: బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రి నేతృత్వంలో ఏర్పాటు చేయనున్న జనరల్ ఆస్పత్రికి ప్రభుత్వ భవనాన్ని కేటాయించారు. ఈమేరకు మున్సిపల్ శాఖకు సంబంధించిన భవనాన్ని కేటాయిస్తు జారీ చేసిన ఉత్తర్వులను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆస్పత్రి నిర్వాహకులకు మంగళవారం పట్టణంలో అందించారు. క్లబ్ ప్రతినిధులు నాగేశ్వర్ రావు, ప్రతాప్ గుప్తా తదితరులు ఉన్నారు.

లండన్‌లో జిల్లా విద్యార్థి క్షేమం

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లకు చెందిన నల్ల అనురాగ్‌రెడ్డి లండన్‌లో తప్పిపోయిన సంగతి విధితమే. కానీ మంగళవారం ఆయన ఆచూకీ లభించినట్లు, క్షేమంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఆయన ఫోన్ మిస్ కావడంతో, కాల్స్ కలువక కుటుంబ సభ్యులు ఆందోళన చెందినట్లు పేర్కొన్నారు. ఇతరుల ఫోన్ నుంచి అతడు కాల్ చేసి క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమచారమందించాడని వారు తెలిపారు.

రెండో టౌన్ ఎస్సైగా సయ్యద్ ఇమ్రాన్

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ ఎస్సైగా సయ్యద్ ఇమ్రాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై యాసీర్ అరాఫత్ మెండోరాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాల వీఆర్‌లో ఉన్న సయ్యద్ ఇమ్రాన్ రెండోటౌన్‌కు బదిలీపై వచ్చారు.

జాగ్రత్తగా ఉండాలి

సిరికొండ: దొంగతనాలు జరుగుతున్నందున గ్రామాలకు వెళ్లేవారు పక్కింటి వారికి, పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎస్సై ఎల్ రామ్ సూచించారు. మండలంలోని చిన్న వాల్గోట్‌లో దొంగతనాలు, సైబర్ నేరాలు, వివిధ సామాజిక అంశాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామాల్లో గుర్తుతెలియని అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, రొండ్ల గోవర్ధన్‌రెడ్డి, బడాల మహిపాల్, సాయారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న చోరులు

- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- వాహనాలు సైతం..
- భయాందోళనలో బాన్సువాడ ప్రజలు



బాన్సువాడలో బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ అశోక్ (ఫైల్)

బాన్సువాడ : పట్టణంలో దొంగలు హడలెత్తిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దోపిడీకి పాల్పడుతున్నారు.దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.పట్టణానికి చెందిన చెనంగారి సాయవ్వ ఈ నెల 19న ఇంటికి తాళం వేసి డాబాపై పడుకోవడంతో ఇంట్లో ఉన్న 12 తులాల బంగారం, సుమారు 60 తులాల వెండి చోరీకి గురయ్యాయి. మనువరాలి పెళ్లికి ఉపయోగపడుతుందని 12 తులాల బంగారం జమ చేస్తే దొంగలు దోచుకెళ్లారని ఆమె వాపోయింది. బాధితులకు అండగా ఉండాల్సిన పోలీసులే ఇంట్లో అంత బంగారం ఎందుకు పెట్టుకున్నారని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. చోరీలు జరిగిన సమయంలో హల్‌చల్ చేసే పోలీసులు చోరీకి గురైన సొత్తును రికవరి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో వరుస చోరీలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి గురువారం జరిగే వారంతపు సంతలో నిఘా పెట్టాల్సి ఉంది. పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో గస్తీ పెంచాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఇటీవల చోటు చేసుకున్న ఘటనలు..

- ఈ నెల 18న పాత బాన్సువాడ ముదిరాజ్ సంఘం వద్ద ఓ పెళ్లికి వచ్చిన బంధువుది పట్టపగలే ద్విచక్ర వాహనం చోరీకి గురైంది.
- అదే రోజు రామ మందిర్ సమీపంలోని ఓ మిల్క్ సెంటర్ నిర్వాహకుడు ఎర్రవాటి సాయిబాబా కౌంటర్‌పై నుంచి సెల్‌ఫోన్ చోరీకి గురైంది.
- మార్చి 12 క్రితం పట్టణంలోని సంగమేశ్వర కాలనీకి చెందిన దుబాస్ రాములు కుటుంబం తన బంధువుల ఇంటికి వెళ్లగా ఇంట్లో ఉన్న రూ. 6500 నగదుతో పాటు 5 తులాల వెండి చోరీకి గురైంది. తలుపులు పూర్తిగా ధ్వంసం చేశారు.
- అదే రోజు అదే కాలనీలో మరో వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేసే ఓ వ్యక్తికి చెందిన పర్సును దొంగిలించారు.

పెద్ద చోరీలు ఐతేనే స్పందిస్తున్నారు



బాన్సువాడలో దొంగతనాలు నివారించడంలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో ఓ చోట చోరీ జరిగిందంటే చుట్టు పక్కల గ్రామాలు, మండల కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేసేవారు. పెద్ద పెద్ద చోరీలు ఐతేనే స్పందిస్తున్నారు. బైకులు, చిన్న చిన్న దొంగతనం చేస్తే పట్టించుకోవడం లేదు.

– దుబాస్ రాములు

సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం

ఇటీవల జరిగిన చోరీలు స్థానికంగా ఉండే వారే చేసినట్లు అనుమానాలు ఉన్నాయి. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నాం. పట్టణంలో గస్తీ పెంచుతాం. చోరీల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– అశోక్, సీఐ బాన్సువాడ

ఉపాధి ప్రణాళిక ఖరారు

- 2025–26 ఏడాదిలో 2.20 లక్షల పనిదినాలు
- వ్యవసాయ పనులకు ప్రాధాన్యత
- కామారెడ్డి మండలంలో 6,538 జాబ్ కార్డులు



గూడెం గ్రామంలో చేపల చెరువును తవ్వుతున్న ఉపాధిహామీ కూలీలు (ఫైల్)

కామారెడ్డి రూరల్: గ్రామాల్లో వలసలను నివారించి కూలీలకు పని కల్పించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనిదినాలను అధికారులు ఖరారు చేశారు. గతేడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు కోసం అధికారులు గ్రామసభలను నిర్వహించారు.

2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31వరకు స్థానికంగానే కూలీలకు పనులు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో..

కామారెడ్డి మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో 2025–26 ఆర్థికసంవత్సరంలో మొత్తం 2,20,200 పనిదినాలను కల్పించాలని డీఆర్డీవో అధికారులు నిర్ణయించారు. మొత్తం 6,538 జాబ్ కార్డులున్నాయి. కార్మిక బడ్జెట్ రూ. 12.43 కోట్లు, మెటిరియల్ బడ్జెట్ రూ. 2 కోట్ల 69 లక్షల 78 వేలు మంజూర య్యాయి. గతానికి భిన్నంగా గ్రామం యూనిట్‌గా పనులు చేపట్టాలని రెండేళ్లక్రితం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పనుల గుర్తింపు, కూలీల వేతనాలను చెల్లించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఎన్‌ఐసీని (నేషనల్ ఇన్‌ఫార్మాటిక్ సెంటర్)వినియోగిస్తున్నారు. ఈ విధానం ద్వారా ఉపాధి పనులకు హాజరైన కూలీలకు ఆధార్‌కార్డు నంబర్‌తో లింక్ ఉన్న బ్యాంకు ఖాతాలో వేతనాలను జమ చేస్తున్నారు.

చేపట్టనున్న పనులు...

కేంద్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం ఈ ఏడాది గ్రామాలకు ఉపయోగపడే పనులను గుర్తించారు. ప్రధానంగా చెరువులు, కుంటలు, పంట కాలువల్లో పూడికతీత, నీటికుంటల నిర్మాణం, ఇంకుడుగుంతలు, వనమహోత్సవానికి గుంతల తవ్వకం, పంటపొలాలకు కొత్త దారుల నిర్మాణం తదితర పనులు చేపట్టనున్నారు. ప్రతి గ్రామంలో వందమందికి తగ్గకుండా ఉపాధి పనులు కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ఉగ్రదాడిని ప్రతిఒక్కరూ ఖండించాలి



అమరుల కుటుంబాలకు సంఘీభావం తెలుపుతున్న రిజిస్ట్రార్ యాదగిరి, టూటా ప్రతినిధులు

తెయూ(డిచ్‌పల్లి): జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేసి హతమార్చడాన్ని ప్రతి ఒక్క భారత పౌరుడు ఖండించాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) ఆధ్వర్యంలో మంగళవారం పహల్గాం అమరుల కుటుంబాలకు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఉగ్రదాడికి ప్రతిగా కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌కు, ముస్లిం ఉగ్రవాదులకు ధీటైన జవాబు ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, టూటా అధ్యక్షుడు పున్నయ్య, కోశాధికారి నాగరాజు, వర్సిటీ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శివనారాయణసింగ్, అధ్యాపకులు శిరీష, వాసం చంద్రశేఖర్, పాత నాగరాజు, బాలకిషన్, మహేందర్ రెడ్డి, స్రవంతి, స్వప్న, నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాయాగౌడ్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

వీడీసీలను కట్టడి చేయండి



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ కులాల జేఏసీ నాయకులు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఆర్మూర్‌లో బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

ఆర్మూర్: గ్రామాల్లో రాజ్యాంగానికి వ్యతిరేకంగా సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లను కట్టడి చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వీడీసీలకు కుల వృత్తిదారులు వెట్టి చాకిరీ చేసే దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మూర్‌లో మంగళవారం బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో వీడీసీల ఆగడాలను నిరసిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న అన్ని కులాలపై వీడీసీలు పెత్తనం చెలాయిస్తూ కుల వృత్తులను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. తాళ్లరాంపూర్‌లో గౌడ కులస్తుల మీదనే కాకుండా జిల్లాలోని నాగంపేట్, మెండోర, పల్లికొండ, చేంగల్ తదితర గ్రామాల్లో యాదవులు, గంగపుత్రులు, రజక, ముదిరాజ్ తదితర కుల వృత్తులపై సైతం వీడీసీల ఆగడాలు కొనసాగుతున్నాయన్నారు. ఆయా కులవృత్తిదారుల నుంచి లక్షల రూపాయలు బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇకపై బీసీ కులాల జేఏసీ ఈ ఆగడాలను నియంత్రించడంలో పోరాటం చేస్తుందన్నారు. అనంతరం ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు గ్రామాభివృద్ధి కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్, ఆర్మూర్ జేఏసీ అధ్యక్షులు నరసింహ చారి, వివిధ కుల సంఘాల ప్రతినిధులు బిజ్జు దత్తాద్రి, దేగం యాదగౌడ్, బస్సాపూర్ శంకర్, మహిపాల్ యాదవ్, బీఎస్ఎన్ఎల్ రాజన్న, రాజమల్లు యాదవ్, స్వామి యాదవ్, భుమన్న యాదవ్, గూపన్ పల్లి శంకర్, బట్టు నరేందర్, లక్ష్మి నర్సయ్య, రవినాథ్, పల్లికొండ నర్సయ్య, వేల్పూర్ శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్, రామగౌడ్, గంగాధర్, చందు, గంగాధర్, నర్సింగ్, రమేష్, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్మూర్ కాంగ్రెస్‌లో ధిక్కార స్వరం

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో సీనియర్, జూనియర్ నేతల తగాదా కారణంగా ధిక్కార స్వరం వినిపిస్తోంది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఇటీవల పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ల ఎంపికలో సీనియర్ కాంగ్రెస్ నాయకులను పక్కన పెట్టి ఇటీవల పార్టీలో చేరిన వారిని, పార్టీతో సంబంధం లేని వారిని డైరెక్టర్లుగా ప్రతిపాదించాడు. దీనిపై టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు మంగళవారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. పదేళ్లుగా పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు ఇవ్వాలనే ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ వినయ్‌రెడ్డి సొంత ఎజెండాను అమలు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మీనాక్షి నటరాజన్ స్పందించి, ఫిర్యాదును పరిశీలిస్తామని పేర్కొన్నారని వెంకటేష్ వివరించాడు.

విద్యుదాఘాతంతో జీపీ కార్మికుడి మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆత్మకూర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తించే ఎండీ బాబా(35) అనే కార్మికుడు మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డాడు. గ్రామంలోని విద్యుత్‌స్తంభాలకు బల్బులు అమర్చేక్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌కు గురై మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఒక కొడుకు ఉన్నారు. సమాచారం అందుకున్న నాగిరెడ్డిపేట పోలీసులు ఘటనపై వివరాలను సేకరిస్తున్నారు.

అల్ప్రాజోలం పట్టివేత

నవీపేట: మండలంలోని జన్నేపల్లి గ్రామంలోని కల్లుబట్టిపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించగా నిషేధిత మత్తుపదార్థం అల్ప్రాజోలం లభ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. మాక్లూర్ మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన భూమాగౌడ్ గత కొన్ని రోజులుగా జన్నేపల్లిలో కల్లుబట్టి నిర్వహిస్తుండగా, కల్లులో నిషేధిత మత్తుపదార్థం కలుపుతున్నాడని సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో 21గ్రాముల అల్ప్రాజోలం లభ్యమైనట్లు పేర్కొన్నారు. అతడికి విక్రయించిన తుంగిని గ్రామానికి చెందిన రామాగౌడ్ ఇంటిపై దాడి చేయగా మరో 22 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరితోపాటు వీరికి విక్రయించిన నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

కేబుల్ వైర్లు చోరీ

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు సుమారు 50 వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు కత్తిరించి అపహరించుకుపోయినట్టు రైతులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్టు రైతులు తెలిపారు.

గంజాయి సేవించిన ఇద్దరి అరెస్ట్

ఖలీరల్‌వాడి: నగరంలోని కోజాకాలనీకి చెందిన షేక్ నోమాన్, ఖిల్లా రోడ్డుకు చెందిన మోహమ్మద్ అర్బాస్ మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో ఒకటో టౌన్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి గంజాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా గంజాయి తాగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

క్రైం కార్నర్

కువైట్‌లో ఎల్లారెడ్డిపల్లెవాసి మృతి



ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన గోషికొండ గంగ నర్సయ్య(36) శుక్రవారం కువైట్‌లో అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు నాలుగు సంవత్సరాలుగా కువైట్‌లో ఉంటున్నాడని, మృతుడికి భార్య, ఏడేళ్ల లోపు ఇద్దరు కొడుకులు ఉన్నట్లు తెలిపారు. మృతదేహం స్వగ్రామం చేరుకునేలా ప్రభుత్వం చొరవ చూపాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

చోరీ సొత్తుతో పట్టుబడ్డ దొంగ

రాజంపేట: చోరీకి పాల్పడి సొత్తుతో బైక్‌పై వెళ్తున్న దుండగుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రేమ్‌సింగ్, మహమ్మద్ అజీమ్‌లు సోమవారం రాత్రి గస్తీ నిర్వహిస్తుండగా తెల్లవారుజామున అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అతడు చోరీ చేసిన సొమ్ము, వస్తువులు కనిపించాయి. నిందితుడు భిక్కనూర్ మండలం, కామారెడ్డి పట్టణంలో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించి, కేసు నమోదు చేశారు. అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. రాత్రివేళ నైట్ డ్యూటీ నిర్వహిస్తూ నిందితుడిని పట్టుకున్న కానిస్టేబుళ్లను ఎస్సై పుష్పరాజ్ అభినందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డి దగ్ధం



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామంలో సోమవారం రాత్రి డీసీఎంలో తరలిస్తున్న గడ్డికట్టలు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని సిర్‌పూర్ నుంచి ముదక్‌పల్లికి డీసీఎంలో గడ్డి కట్టలు తీసుకెళ్తున్నారు. సిర్‌పూర్ గ్రామ పంచాయతీ వద్ద విద్యుత్ తీగలు వ్యాన్‌కు తగిలి మంటలు చెలరేగాయి. స్థానికులు బోరు పైపుతో నీరు పట్టి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ గడ్డి కట్టలకు మంటలు అంటుకుని చెలరేగడంతో గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో డీసీఎం వ్యాన్ స్వల్పంగా దెబ్బతినగా, గడ్డి కట్టలు కాలిపోయాయి.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో మూడురోజుల జైలుశిక్ష

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని నాగ్‌పూర్ గేట్, సీఎంసీ చౌరస్తాలో ఈ నెల 20న ఎస్సై ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. బీబీపూర్ తండాకు చెందిన బదావత్ మంగులాల్, మహారాష్ట్రకు చెందిన శ్రీరంగు రామ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రహీముద్దీన్ నిందితులకు మూడు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో నిందితులను జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దోమకొండలో వ్యక్తి అదృశ్యం



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన అవధూత నర్సింలు (49) అదృశ్యమైనట్లు ఎస్సై స్రవంతి మంగళవారం తెలిపారు. ఈనెల 25న ఉదయం నర్సింలు ఇంట్లో మేస్త్రి పనికి వెళ్లి వస్తా అని చెప్పి బయటకు వెళ్లాడు. ఇప్పటివరకు తిరిగి ఇంటికి రాలేదు. నాలుగు రోజులుగా కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం నర్సింలు కుమారుడు సిద్ధిశ్వర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

కమ్మర్‌పల్లిలో ఒకరి ఆత్మహత్య

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన వేముల పోశెట్టి(55) ఈనెల 27న ఇంటి నుంచి బయటకి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం వెతికగా లభించలేదు. దీంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని చెరువులో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, వేముల పోశెట్టిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోశెట్టి కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడని, దీంతో మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు విచారణలో తేలింది. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్ గంగాధర్ ఆత్మహత్యకు యత్నించాడు. ఈనెల 22 నుంచి మెడికల్ సెలవులో ఉన్న గంగాధర్ మంగళవారం డిపోకు వచ్చాడు. డిపోలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డు వద్దకు వచ్చి తాను గడ్డి మందు సేవించానని చెప్పడంతో అక్కడున్న సిబ్బంది వెంటనే గంగాధర్‌ను బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం గంగాధర్ పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం సరితాదేవిని వివరణ కోరగా.. గంగాధర్ తనను కలిసేందుకు డిపోకు వచ్చాడని, కార్యాలయంలో సిక్ లీవ్ కోసం దరఖాస్తు రాసివ్వమని చెప్పి తాను బిచ్కుందకు వెళ్లినట్లు తెలిపారు. గతంలో కూడా గంగాధర్ రెండు, మూడు సార్లు ఇలాగే చేశాడని ఆమె అన్నారు.

హంగర్గాలో చోరీ



హంగర్గాలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గా గ్రామంలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పుట్టి రాములుకు ఇద్దరు కుమారులు లక్ష్మణ్, శ్రీకాంత్ ఉన్నారు. వేసవి ఉక్కపోత కారణంగా శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి డాబాపై నిద్రించారు. రాత్రి వేళ దుండగులు ఇంట్లోకి చొరబడి లక్ష్మణ్ గదికి బయట నుంచి గొళ్లెం వేసి ఇంట్లో ఉన్న వస్తువులు ఎత్తుకెళ్లారు. శ్రీకాంత్ గదిలో ఉన్న బీరువా తాళం పగులగొట్టి ఐదు తులాల బంగారు, నాలుగు తులాల వెండి ఆభరణాలు, ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను ఎత్తుకెళ్లారు. లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సునీల్ తెలిపారు.

హైవేపై దారిదోపిడీ

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులోని జాతీయ రహదారి 44 సర్వీస్ రోడ్డుపై దారిదోపిడీ జరిగింది. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. మెండోరా మండలం కోడిచర్ల గ్రామానికి చెందిన ఏలేటి దేవాయి తన బంధువులతో కలిసి ఆటోలో సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. అదేరోజు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో కోడిచర్లకు తిరుగుపయనమయ్యారు. కొత్తపల్లి శివారులోని హైవే సర్వీస్ రోడ్డు నుంచి బైపాస్ రోడ్డు ఎక్కుతున్న సమయంలో స్పీడ్ బ్రేకర్ ఉండటంతో ఆటో వేగం తగ్గించారు. ఇది గమనించిన ముగ్గురు దుండగులు ఒక్కసారిగా ఆటోలో ప్రయాణిస్తున్న గుండుక మంజుల మెడలో గొలుసు పట్టుకుని లాగగా చిక్కలేదు. వెనుక వరుసలో కుర్చున్న ఏలేటి దేవాయి మెడలో బంగారు గుండ్లను పట్టి లాగడంతో కొంత భాగం (పదిగ్రాములు) తెగి దుండగుల చేతికి చిక్కింది. దీంతో దుండగులు బైక్‌పై వెంటనే పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు క్యాష్‌ప్రైజ్



సిబ్బందిని అభినందిస్తున్న ఉన్నతాధికారులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి మంగళవారం రూ. 15వేల క్యాష్ రివార్డు అందజేశారు. ఇటీవల నవీపేట్ మండలం యంచ వద్ద 30కిలోల డ్రై గంజాయి, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది స్వాధీనం చేసుకుని, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈసందర్భంగా వారిని అభినందిస్తూ క్యాష్‌ప్రైజ్‌ను అందజేశారు. అలాగే ఫిబ్రవరి 14న కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్‌లో 91కిలోల ఎండుగంజాయిని పట్టుకున్నారు. వీరికి రూ.30 వేల క్యాష్ ప్రైజ్ ఇచ్చారు. ఎక్సైజ్ అదనపు కమిషనర్ ముఖర్జీ, డీసీ సోమిరెడ్డి, ఎస్‌టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రణవని, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న, ఎస్సై రామకుమార్, సిబ్బంది హమీద్, అవినాష్, విష్ణు, సుకన్య, శ్యామ్ సుందర్, సాయి కుమార్‌లు ఉన్నారు.

గోశాలకు ఆవుల తరలింపు



రామారెడ్డి: కరీంనగర్ జిల్లా నుంచి మూడు చిన్న టాటా ఏస్ వాహనాల్లో 16కు పైగా ఆవులను మంగళవారం మండుటెండలో తూప్రాన్ తరలిస్తుండగా మాచారెడ్డి పోలీసులు పట్టుకొని మద్దికుంటలోని గోశాలకు తరలించారు. ఈ ఆవులను తూప్రాన్ సంతలో రైతులకు అమ్మడానికి తీసుకెళ్తున్నట్టుగా సమాచారం. కానీ ఆవులకు కనీస వసతులు కల్పించకుండా ఒక్కో వాహనంలో ఆరు ఆవులను ఎండలో తరలిస్తుండడంతో అవి విలవిలకొట్టుకోవడాన్ని పోలీసులు గమనించి అడ్డుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి, ఆవులను మద్దికుంట గోశాలకు తరలించారు.

దొంగల ముఠా సభ్యుల అరెస్టు

ఇందల్వాయి: వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాలోని ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై సందీప్, డిచ్‌పల్లి సీఐ మల్లేశ్ వివరాలు వెల్లడించారు. గన్నారం ఎక్స్ రోడ్ దగ్గర పోలీసులు మంగళవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు కారులో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకొని, విచారించారు. వారం రోజుల కిందట ఇందల్వాయి మండలంలో జరిగిన వరుస దొంగతనాలు, జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో జరిగిన దొంగతనాలకు, భిక్కనూరులోని బస్వాపూర్‌లో జరిగిన దొంగతనాలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో చందుర్తి, కోనారావుపేటల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాలోని సభ్యులుగా గుర్తించారు. నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో సుమారు పది కేసులలో నిందితులుగా ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా, న్యాల్‌కల్ ప్రాంతాలలో రోడ్డు వరకు ఉన్న షెడ్లు, ఆక్రమణలను మంగళవారం ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఆక్రమణలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణదారులు నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.